క్లుప్తంగా

రేపు వాసవీమాత జయంతి

తిరువూరు: వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతిని శనివారం నిర్వహిస్తున్నట్లు వాసవీ క్లబ్ కార్యవర్గం గురువారం తెలిపింది. అమ్మవారి జయంతి కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఉదయం 9 గంటలకు సామూహిక కుంకుమపూజలు, 108 రకాల ప్రసాదాలతో నివేదన, వాసవీమాత ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. సభ్యులంతా తప్పక పాల్గొనాలని కోరారు.

144 సెక్షన్ కొనసాగింపు

తిరువూరు: ఎన్నికల నియమావళి అమలులో భాగంగా తిరువూరు అసెంబ్లీ నియోజకవర్గంలో జూన్ 10వతేదీ వరకు 144 సెక్షన్ కొనసాగుతుందని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో మాధవి గురువారం తెలిపారు. అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ప్రదర్శనలు చేయరాదని ఆదేశించారు. 144 సెక్షన్‌లోని నిబంధనల మేరకు నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరూ వ్యవహరించాల్సి ఉంటుందని ఆర్వో సూచించారు.

కుక్కల బెడదతో భయాందోళనలు



నూజివీడు: పట్టణంలో వీధికుక్కల బెడద అధికంగా ఉంది. ఏ వీధికి వెళ్లినా గుంపులు గుంపులుగా తిరుగుతుండటంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. వీటిని నియంత్రించేందుకు స్థానిక సంస్థల అధికారులు తీసుకుంటున్న చర్యలు శూన్యం. పట్టణంలో వీధికుక్కల విషయమై గతంలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చినా, సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. జరిగింది. కుక్కలు గుంపులుగా వీధుల్లో స్వైరవిహారం చేస్తుండటంతో బయటకు రావడానికి పిల్లలు, మహిళలు, వృద్ధులు భయపడుతున్నారు. ద్విచక్రవాహనాల వెంట పడుతుండటంతో అవి ఎక్కడ కరుస్తాయోనని వాటి నుంచి తప్పించేందుకు తమ వాహనాలను మరింత వేగంగా నడపాల్సి వస్తోందని వాపోతున్నారు. పట్టణంలోని ఎంప్లాయీస్ కాలనీ, గాంధీనగర్, ప్రభుత్వ ఆసుపత్రి ఏరియా, కొప్పులవెలమపేట, రామాయమ్మరావుపేట, బాపూనగర్, అజరయ్యపేట, ధంధం గార్డెన్, బంగినపల్లితోట, ఎన్టీఆర్ కాలనీ తదితర ప్రాంతాలలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



తిరువూరు: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని తిరువూరు అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి రేష్మాబేగం సూచించారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరువూరులో గురువారం స్థానిక యూపీహెచ్‌సీ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. డెంగీ, చికున్‌గున్యా వంటి వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. దోమకాటుకు గురికాకుండా దోమతెరలు వాడాలని సూచించారు. దోమలు వృద్ధి చెందకుండా ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. అధిక జ్వరం, కండరాల నొప్పులు, కీళ్ళ నొప్పులు, చర్మం దురద, దద్దుర్లు వచ్చినట్లు గమనిస్తే డెంగీ జ్వరంగా గుర్తించి వెంటనే ఆసుపత్రిలో వైద్యపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ర్యాలీలో ఆరోగ్య పర్యవేక్షకులు రవి, హెల్త్ విజిటర్ ఆషాబీ, ఆరోగ్య, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

బాబాకు మామిడి పండ్ల రసంతో అభిషేకం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు షిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం వైశాఖ మాసం పురస్కరించుకుని సాయినాథుడు, శ్రీ మరకత పోలిన శ్రీ భవానీ శంకర స్వామి వారికి మామిడి పండ్ల రసంతో అభిషేకం నిర్వహించారు. మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి చేతులమీదుగా మామిడి పండ్ల రసంతో అభిషేకం జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు మామిడి పండ్లు తీసుకొచ్చి మామిడి పండ్ల రసంతో బాబావారికి భక్తిశ్రద్ధలతో అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి మాట్లాడుతూ ఏటా తాము లోక కళ్యాణార్థం భక్తులు, దాతల సహకారంతో వైశాఖ మాసంలో బాబాకు మామిడి పండ్ల రసంతో అభిషేకం నిర్వహిస్తున్నామన్నారు. బాబావారి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలని ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మందిర సంయుక్త కార్యదర్శి విష్ణు వర్ధన్ కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు. అనంతరం భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

ప్రజలకు ఆరోగ్య భరోసా

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): గత టీడీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన ప్రభుత్వ వైద్యశాలల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కోట్లాది రూపాయలు వెచ్చించి పట్టణాలతోపాటు గ్రామాల్లోనూ వైద్యశాలలను నిర్మించడం ద్వారా వైద్యసేవలను అందిస్తూ ప్రజల ఆరోగ్యానికి భరోసానిచ్చింది. నాడు-నేడు పథకం కింద కొండపల్లి, ఇబ్రహీంపట్నం ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను అభివృద్ధి చేయడంతోపాటు అర్బన్ పీహెచ్‌సీలను నిర్మించింది.

30వేల జనాభాకు ఒకటి చొప్పున..

67వేల జనాభా కలిగిన కొండపల్లి, ఇబ్రహీంపట్నం జంట పట్టణాలను కలిపి 2020 జనవరిలో ప్రభుత్వం గ్రేడ్-3 మున్సిపాల్టీగా ఏర్పాటు చేసింది. కొండపల్లి మున్సిపాల్టీలో ప్రజలకు మెరుగైన ఆరోగ్యసేవలు అందించేందుకు ప్రభుత్వం డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలు రెండు కేటాయించింది. ప్రతి 30వేలు జనాభాకు ఒకటి చొప్పున రెండు వైద్యశాలలు నిర్మించారు. ఒక్కొక్క భవనంకు రూ.80లక్షలు చొప్పున రెండింటికి రూ.1.60 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. నూతన భవనాలతో పాటు ఆరోగ్య సిబ్బందిని నియమించారు. రోజుకు 100 నుంచి 150మంది ఉచితంగా వైద్యసేవలు పొందుతున్నారు. బీపీ, మధుమేహం వంటి దీర్ఘకాలిక రోగులకు రక్తపరీక్షలు, గర్భిణుల నెలవారీ వైద్య పరీక్షలు, ఈసీజీ వైద్య సేవలు అందిస్తున్నారు.



కొండపల్లిలో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్

ఆధునిక వైద్య సదుపాయాలు:

డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో 10 విశాలమైన గదులు ఏర్పాటు చేశారు. ఔట్ పేషెంట్, ఇన్ పేషెంట్ గదులు, కాన్పుల గది, ఆపరేషన్ థియేటర్, ల్యాబ్, ఫార్మశీ, రెండు మినీ జనరల్ వార్డులు ఉన్నాయి. వైద్యులతోపాటు ల్యాబ్ టెక్నీషియన్, స్టాఫ్ నర్స్‌లు, ఫార్మాసిస్ట్, అటెండర్ అందుబాటులో ఉన్నారు. ఎవరికైనా వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటే ఈ-సంజీవని యాప్ ద్వారా స్పెషలైజేషన్ వైద్యుని సలహాలు స్వీకరించి చికిత్స అందిస్తున్నారు. మాతా శిశు మరణాలు నివారణకు 24గంటల వైద్యసేవలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి.

206 రకాల మందులు..

మధుమేహం, బీపీ, ఫిట్స్, ఆస్తమా, కిడ్నీ, థైరాయిడ్, సాధారణ తదితర 65 రకాల వైద్య పరీక్షలను రోగులకు ఉచితంగా చేస్తున్నారు. 206 రకాల మందులను రోగులకు అందుబాటులో ఉంచారు. మధుమేహం, బీపీ వ్యాధిగ్రస్తులకు అన్ని రకాల వైద్య పరీక్షలు చేయడంతోపాటు మందులు ఉచితంగా అందజేస్తున్నారు.



కొండపల్లిలో రూ.54లక్షలతో నిర్మించిన ఈఎస్ఐ వైద్యశాల నూతన భవనం

కార్మికులకు అండగా..

గత టీడీపీ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహించింది. మండల స్థాయిలో 12గ్రామాలకు కలిపి రెండు పీహెచ్‌సీలు మాత్రమే ఉండటంతో ప్రజలకు అరకొర వైద్యసేవలు అందాయని ప్రజలు గుర్తుచేసుకుంటున్నారు. నేడు సీఎం జగనన్న ప్రభుత్వం రెండు పీహెచ్‌సీలతోపాటు గ్రామాల్లో వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేసి పేదలకు పేదలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తుండటంపై ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు. అదేవిధంగా ఇబ్రహీంపట్నం, కొండపల్లి ప్రాంతాల్లోని 5వేల మంది అసంఘటిత కార్మికుల కోసం ప్రభుత్వం రూ.54లక్షలతో ఈఎస్ఐ వైద్యశాలకు నూతన భవనం నిర్మించింది. కార్మికులకు మెరుగైన వైద్యసేవలందించాలనే ఉద్దేశంతో నూతన భవన నిర్మాణంతోపాటు ఆధునిక వైద్యసేవలను అందిస్తోందంటూ కార్మికులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

ప్రజల చెంతకే వైద్యసేవలు



ఆగిరిపల్లి: వైద్యం కోసం నిరుపేదలు అప్పుల పాలు కాకూడదన్న దృఢసంకల్పంతో రాష్ట్రప్రభుత్వం వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. ప్రజలకు చేరువగా గ్రామాల్లో హెల్త్ సెంటర్లు నిర్మించింది. గతంలో మండల కేంద్రాలు, పట్టణంలోనే లభించే సంపూర్ణ వైద్య సేవలు ఇప్పుడు గ్రామాల్లోని ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, ప్రైమరీ హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేసిన ప్రభుత్వం, వాటి ద్వారా నాణ్యమైన వైద్య సేవలు అందిస్తుంది. గ్రామ సచివాలయల వారీగా హెల్త్ క్లినిక్‌లు నిర్మించి నిపుణులైన వైద్యుల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తున్నారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ వైద్య సేవలపై ప్రజలు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రమైన ఆగిరిపల్లిలో రూ.1.80 కోట్లతో అత్యధిక వసతులతో ప్రైమరీ హెల్త్ సెంటర్ నిర్మించారు. అలాగే మండలంలోని గ్రామాల్లో రూ.25 లక్షలతో నిర్మించిన విలేజ్ హెల్త్ సెంటర్లు ప్రజలకు నిత్యం వైద్యసేవలు అందిస్తున్నాయి.

మెరుగైన సదుపాయాలు..



కొండపల్లి మున్సిపాల్టీలోని వైఎస్సార్ అర్బన్ హెల్త్‌సెంటర్లలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయి. సాధారణ వ్యాధులతోపాటు గర్భిణులు, చిన్నారులకు నిపుణులైన డాక్టర్లు వైద్యం అందిస్తుండటం హర్షనీయం.

కోలకాని శ్రీనివాసరావు, ఇబ్రహీంపట్నం

వైద్యసేవలు బాగున్నాయి..



వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో నేను గర్భిణీగా నెలవారీ వైద్య పరీక్షలు చేయించుకున్నాను. వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి మందులు ఇచ్చేవారు. సకాలంలో వైద్యసేవలు పొందడం ద్వారా ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనిచ్చాను నా బిడ్డకు అన్ని రకాల వ్యాధి నిరోధక టీకాలు, డోసులు యూపీహెచ్‌సీలో వేయిస్తున్నాను.

వేములు రూతు, శ్రామికనగర్, కొండపల్లి

నూజివీడులో రూ.1.60 కోట్లతో వైద్యశాలలు



ఎమ్మార్ అప్పారావు కాలనీలో శరవేగంగా సాగుతున్న వైద్యశాల నిర్మాణ పనులు

నూజివీడు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఐదేళ్లుగా విద్యకు, వైద్యానికి అధిక ప్రాధాన్యతనిస్తోంది. నూజివీడులో పేద ప్రజలందరికి వైద్యంను మరింత అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం రెండు వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను మంజూరు చేసింది. పురపాలక సంఘం పరిధిలోని శివారు కాలనీ ప్రజలకు ఏరియా ఆసుపత్రి దూరంగా ఉండటంతో వారికి మరింత దగ్గరగా వైద్య సేవలందించాలనే సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేసింది. ఏ చిన్న జబ్బు వచ్చినా ఆరోగ్య కేంద్రాలకు వచ్చేలా వీటిని ఏర్పాటు చేసింది. ఒక్కో వైద్యశాలకు రూ.80లక్షలు చొప్పున రూ.1.60కోట్లు మంజూరు చేసింది. ఈ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 10 పడకలు, ఫార్మసీ, ఔట్ పేషెంట్ గదులు, రెండు శస్త్రచికిత్స గదులు, లాబరేటరీ, రోగుల సహాయకులకు విశ్రాంతి గదులు, వైద్యుల గది ఉంటాయి. తగినంత మంది వైద్య సిబ్బందిని ఏర్పాటు చేసి పేద ప్రజలకు వైద్యం అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. వీటిల్లో పట్టణంలోని కోనేరు పేటలో ఓ పీహెచ్‌సీ భవన నిర్మాణంను పూర్తిచేసి నాలుగు నెలల క్రితం ప్రారంభించి ప్రజలకు వైద్యసేవలందిస్తున్నారు. రెండో ఆసుపత్రి భవన నిర్మాణ పనులు ఎమ్మార్ అప్పారావు కాలనీలో శరవేగంగా సాగుతున్నాయి. ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం రాష్ట్రప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని చెప్పవచ్చు.

డెంగీ వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ

ముసునూరు: డెంగీ వ్యాధిని అంతమొందించాలంటే అందరూ దోమల నిర్మూలనకు కృషిచేయాలని వైద్యాధికారులు షకీనా ఇవాంజిలిన్, కరీముల్లా, అవినాష్ పిలుపునిచ్చారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం పీహెచ్‌సీల వైద్యాధికారుల ఆధ్వర్యంలో ముసునూరు, రమణక్కపేటల్లో అవగాహన సభలు, ర్యాలీలను నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ మంచి పరిసరాలతోనే చక్కని ఆరోగ్యం సాధ్యమనే విషయాన్ని అందరూ గుర్తించాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు అనంతరం వడదెబ్బ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్లు మురళి, అలెగ్జాండర్, అర్జునరావు, కృష్ణారావు, పీహెచ్‌సీల సిబ్బంది, ఆశవర్కర్లు పాల్గొన్నారు.



ముసునూరులో అవగాహన ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

జగనన్న కాలనీలకు విద్యుత్ సౌకర్యం

చాట్రాయి: పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోంది. రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సొంత ఇల్లు ఉండాలనే లక్ష్యంతో నవరత్నాలు పేదలందరికి ఇళ్ల పథకంలో ఇళ్లు మంజూరు చేశారు. ఇందుకోసం మండలంలోని గ్రామ పంచాయతీల్లో 35 లేఅవుట్లు ఏర్పాటు చేశారు. 1730 ప్లాట్లు విభజించి లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చారు. వీరిలో 214 మందికి గృహాలు మంజూరు కాగా 110 మంది గృహాలు నిర్మించుకుని కొందరు గృహ ప్రవేశాలు చేశారు. కాగా కాలనీల్లో మౌలిక సదుపాయాల్లో భాగంగా బోర్లు, రోడ్లు, తాగునీటి పైపులైన్లు, 24 గంటల విద్యుత్ సౌకర్యం కల్పించారు. గత టీడీపీ ప్రభుత్వం ఒక్కరికీ కూడా ఇంటి స్థలం ఇవ్వలేకపోవడంతో జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఇచ్చిన హామీ మేరకు ఇంటి స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణాలకు రూ.1.80 లక్షలు మంజూరు చేయడంతో గృహాలు నిర్మించుకుని సొంతింటిలో ఉంటున్నారు. ఇలా పేదల సొంత ఇల్లు కలనేరవేరడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



చనుబండ జగనన్న కాలనీలో ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ముసునూరు: యువతి అదృశ్యంపై ముసునూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్ఐ పి.వాసు కథనం మేరకు వేల్పుచర్లకు చెందిన లాగు నాగేంద్రుడు చిన్నకుమార్తె ఈనెల 12వతేదీ ఉదయం పదిన్నర గంటల నుంచి కనిపించడం లేదు. బంధువులు, తెలిసిన వారి ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో నాగేంద్రుడు ముసునూరు పోలీసులకు బుధవారం సాయంత్రం ఫిర్యాదు చేశాడు. తన కుమార్తె అదృశ్యం వెనుక బొడ్డపాటి అశోక్ అనే వ్యక్తి ఉన్నట్లు ఆఫిర్యాదులో అనుమానం వ్యక్తంచేశాడు. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్చరీ క్రీడాకారుడికి సత్కారం

మధురానగర్(విజయవాడసెంట్రల్): 10+2 పరీక్షలలో ఉత్తీర్ణత సాధించిన ఆర్చరీ క్రీడాకారుడు భూటాన్ గ్రాండ్ ఫిక్స్-2 విజేత పెండ్యాల త్రినాథ్ చౌదరి గురువారం అధ్యాపకుడు పులుగు దీపక్‌ను మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆర్చరీ శిక్షణలో బిజీగా ఉన్న తనకు అత్యుత్తమ శిక్షణ ఇచ్చి సీబీఎస్ఇ 10+2 పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించటానికి సహకరించారని తెలిపారు. ఈ నెల 11, 12 తేదీల్లో జరిగిన భూటాన్ గ్రాండ్ ఫిక్స్-2 పోటీల్లో విజేతగా నిలిచిన ఆర్చరీ క్రీడాకారుడు పెండ్యాల త్రినాథ్‌చౌదరిని, పులుగు దీపక్‌ను సత్కరించి అభినందించారు.

ఇంద్రకీలాద్రిపై దక్షిణామూర్తికి విశేష అభిషేకాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై గురువారం దక్షిణామూర్తికి విశేష అభిషేకాలు, అర్చన నిర్వహించారు. మల్లేశ్వర స్వామి వారి ఆలయం సమీపంలోని దక్షిణామూర్తికి ఆలయ అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం విశేష అలంకరణ, పూజల్లో ఈవో రామరావు పాల్గొన్నారు. మల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రధాన అర్చకులు మల్లేశ్వరశాస్త్రి, వైదిక కమిటీ సభ్యులు కోట ప్రసాద్, ఇతర ఆలయ అర్చకులు పూజలు జరిపించారు. పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొని తమ నామగోత్రాలతో పూజ జరిపించుకున్నారు.

కష్టానికి మించిన ఫలితం రాబోతోంది: సర్నాల

జి.కొండూరు: వైఎస్సార్ సీపీ విజయం కోసం కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటానని వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు అన్నారు. మండల పరిధిలోని దుగ్గిరాలపాడు, గంగినేని, తెల్లదేవరపాడు, సున్నంపాడు, మునగపాడు, చెర్వుమాధవరం, గడ్డమణుగు గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడి వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈసందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ ఈ ఎన్నికలలో నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు పడిన కష్టానికి మించిన ఫలితం రాబోతుందన్నారు. జగనన్న మరోసారి ముఖ్యమంత్రి కాబోతున్నారని, సంక్షేమం, అభివృద్ధి మరింత మిన్నగా జరుగుతాయని ధీమా వ్యక్తం చేశారు.



మునగపాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు

ఏపీఈఏపీ సెట్‌కు 292మంది హాజరు



నోటీసుబోర్డులో వివరాలు సరిచూసుకుంటున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు



హాలు టికెట్‌ను పరిశీలించి, పరీక్షాకేంద్రంలోకి విద్యార్థులను అనుమతిస్తున్న సిబ్బంది

తిరువూరు: రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో ఈఏపీసెట్‌లో భాగంగా గురువారం తిరువూరు వాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో అగ్రికల్చరల్, ఫార్మసీ ప్రవేశపరీక్షను నిర్వహించారు. కళాశాలలోని పరీక్ష కేంద్రంలో ఉదయం సెషన్‌లో 159మంది విద్యార్థులకుగాను 141మంది హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌కు పరీక్షకు 160మంది విద్యార్థులకుగాను 151మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 319మంది విద్యార్థులకుగాను పరీక్షలకు 292మంది విద్యార్థులు హాజరుకాగా, 27మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ రంగా నాగేంద్రబాబు తెలిపారు.

విద్యార్థుల ప్రతిభకు పదును

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): జిల్లా గ్రంథాలయశాఖ ఆదేశాల మేరకు స్థానిక సత్యనారాయణపురంలో ఈ నెల 15 నుంచి జూన్ 7 వరకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నారు. గ్రంథాలయంలో గురువారం ఏర్పాటు ఏర్పాటు చేసిన శిబిరంలో పెద్ద సంఖ్యలో పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి పి.సంపత్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఏడాది వేసవిలో విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పుస్తక పఠనం, నీతి కథలు చెప్పించడం, జాతీయ నాయకుల చరిత్రలు చదివించిడం, పుస్తక సమీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అక్షర రూపం దాల్చిన శిరాచుక్క లక్ష మెదళ్ల కదలికలకు ప్రతిరూపంగా నిలుస్తుందని ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు బోధించారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే ఈ శిబిరంలో విద్యార్థులు హాజరయ్యేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. అనంతరం 'నీకు నచ్చిన చిత్రం' అనే అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ లెక్చరర్ బి.సావిత్ర, రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ సుబ్బయ్య, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.



చిత్రలేఖనం పోటీలలో పాల్గొన్న విద్యార్థులతో గ్రంథాలయ అధికారి సంపత్‌కుమార్

శృతిలయ సమన్వితం... త్యాగరాజ సంకీర్తనం



త్యాగరాజ కృతులను గానం చేస్తున్న శర్వాణి



సంగీతోత్సవంలో భక్తిగా త్యాగరాజ కృతులను గానం చేస్తున్న రఘునాథరావు

విజయవాడ కల్చరల్: శ్రీ సద్గురు సంగీతసభ ఆధ్వర్యంలో దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న సద్గురు త్యాగరాజ స్వామి 257 వ జయంతి ఉత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోని సంగీత విద్వాంసులు కచేరీలో పాల్గొని ఉత్సవాలకు శోభను అందిస్తున్నారు.

గురువారం నాటి కార్యక్రమంలో కె.శర్వాణి, శృతిలయ నివాస్ విద్యార్థులు, మంత్ర ప్రగడ దుర్గా ప్రమీల, కె.శ్రీవిద్య, కె.అనిల్‌కుమార్ డీవీఆర్ సీత, పోపూరి శ్యామసుందర్, వీరుభట్ల సీతారమణి, గండూరి లక్ష్మీ హర్షిత, సాయి కృష్ణ కౌశిక్, ముళ్ళమూడి శ్రీనిధి, విష్ణుభొట్ల సోదరీ మణులు త్యాగరాజ స్వామి కృతులను ఆలపించారు. కేఎస్ గోవిందరాజన్ వీణపై త్యాగరాజ కృతులను ఆలపించారు. సంగీతోత్సవంలో 6 సంవత్సరాల శర్వాణి నుంచి 85 సంవత్సరాల రఘునాథరావు పాల్గొనటం విశేషం. సంగీత కళాకారులకు నిర్వాహకులు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు బీవీఎస్ ప్రకాష్, ప్రధాన కార్యదర్శి గౌరీనాథ్, ఉపాధ్యక్షుడు హరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో వెంపటి పెద్ద సత్యరామ కూచిపూడి అకాడమీకి చెందిన చిన్నారులు గురువారం ప్రదర్శించిన నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై అన్నంభోట్ల శోభ బృందం పలుకీర్తనలకు నృత్యప్రదర్శన ఇచ్చారు. అమ్మవారిని దర్శించుకుని ధర్మపథం వద్దకు చేరుకున్న భక్తులు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శనను ఆద్యంతం ఎంతో ఆసక్తిగా వీక్షించారు. అనంతరం పలువురు భక్తులు చిన్నారులను అభినందించారు. నృత్య ప్రదర్శన అనంతరం చిన్నారులకు కనకదుర్గ అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలు అందజేశారు.



నృత్యం చేస్తున్న చిన్నారులు

ఆకట్టుకున్న సినీ సంగీత విభావరి



విజయవాడ కల్చరల్: పుష్పాంజలి రిథమ్స్ ఆధ్వర్యంలో నెల వారీ కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికమీద గురువారం నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. సీనియర్ గాయకుడు బాలాజీ కుమార్ ఆధ్వర్యంలో నగరానికి చెందిన గాయనీ గాయకులు సుధారాణి, లక్ష్మీ దుర్గ, దుర్గ, నాగలక్ష్మి, గెల్లి సువర్ణ, బోయిన వేణుగోపాల్, గాయత్రి శర్మ, విజయశ్రీ గుప్తా తదితరులు పలు తెలుగు, హిందీ చిత్రగీతాలను ఆలపించారు. ఈ సందర్భంగా గాయకుడు బాలాజీ కుమార్ మాట్లాడుతూ గాయనీ గాయకులు స్వయంకృషితో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు.